సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025



చరిత్రకు సాక్ష్యాలు

ఆది మానవుల చరిత్రకు ఆనవాళ్లుగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రాంతం నిలుస్తోంది.

వివరాలు IIలో ▸



సమీకృతం.. నిధుల గండం

హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో ఇంటి గ్రేటెడ్ మార్కెట్ భవనానికి నిధుల గ్రహణం పట్టుకుంది.

వివరాలు IIలో ▸



భారీ వర్షాలు..

భారీ వర్షాలకు సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి.

వివరాలు IIIలో ▸

త్రిపుర సుందరిగా..

దేవీశరన్ననవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శనివారం శ్రీలలితా త్రిపుర సుందరిదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని రాచన్నపేట, మాణిక్‌ప్రభు వీధిలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు ఘనంగా పూజలు నిర్వహించారు. మాణిక్‌ప్రభు వీధిలో ప్రతిష్ఠించిన అమ్మవారిని మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు సందర్శించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సురేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

– జహీరాబాద్ టౌన్:



మాణిక్‌ప్రభు వీధిలో అమ్మవారిని దర్శించుకున్న సుభాష్‌రావు తదితరులు

తీరొక్క పువ్వై..

కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శనివారం గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, మత్స్యశాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ మాధురి, చంద్రశేఖర్, అధికారులతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

– సంగారెడ్డి జోన్:



ఉద్యోగులతో కలసి బతుకమ్మ ఆడుతున్న అదనపు కలెక్టరు మాధురి

రిజర్వేషన్లు ఖరారు



బీసీలకు 11 చొప్పున ఎంపీపీలు, జెడ్పీటీసీ స్థానాలు రిజర్వు

- ఇందులో బీసీ మహిళలకు ఐదు కేటాయింపు
- ఎస్సీలకు ఆరు చొప్పున ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు..
- రెండేసి చొప్పున ఎస్టీలకు కేటాయింపు..
- మూడు జనరల్ స్థానాలు మరో మూడు జనరల్ మహిళలకు రిజర్వేషన్లు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: స్థానిక సంస్థల రిజర్వేషన్లపై నెలకొన్న ఉత్కంఠ ఎట్టకేలకు వీడింది. జెడ్పీటీసీ (జిల్లా పరిషత్ టెరిటోరియల్ కానిస్టేన్సీ), ఎంపీపీ (మండల పరిషత్ అధ్యక్షుల) స్థానాల రిజర్వేషన్లను శనివారం ఖరారు చేశా యి. సుమారు వారం రోజుల పాటు కసరత్తు చేసిన అధికారులు ఈ మేరకు ఆయా స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేసి ప్రభుత్వానికి పంపారు. జిల్లాలో మొత్తం 25 మండలాల్లో మొత్తం 11 చొప్పున జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు బీసీలకు రిజర్వు అయ్యాయి. ఇందులో బీసీ మహిళలకు ఐదు మండలాలు రిజర్వు కాగా, ఆరు స్థానాలు బీసీ జనరల్ అయ్యాయి. ఎస్సీ సామాజికవర్గానికి ఆరు చొప్పున జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు కేటాయించారు. ఇందులో మూడు చొప్పున ఎస్సీ మహిళకు రిజర్వు చేశారు. ఎస్టీలకు రెండు జెడ్పీటీసీ స్థానాలు, రెండు ఎంపీపీ స్థానాలు రిజర్వు అయ్యాయి. ఇందులో ఒక్కొక్కటి చొప్పున మహిళలకు రిజర్వు చేశారు.

వారం రోజులుగా కసరత్తు..

ఈ రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు వారం రోజులుగా కసరత్తు చేశారు. 2011 జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను లెక్కించారు. ఇందులో మహిళా రిజర్వేషన్లను డ్రా పద్ధతిలో కేటాయించారు. మరోవైపు బీసీ రిజర్వేషన్లను సంబంధించి ప్రభుత్వం ప్రకటించినట్లుగా 42% స్థానాలకు బీసీలకు కేటాయించారు. ఆయా మండలాల్లో బీసీల జనాభా ఆధారంగా రిజర్వేషన్లను ఖరారు చేశారు. అయితే కులగణన గణాంకాల ఆధారంగా ఈ బీసీ రిజర్వేషన్లను ఖరారు చేశారు. 2019లో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా స్థానాల రిజర్వేషన్లను సైతం పరిగణలోకి తీసుకుని, రొటేషన్ పద్ధతిలో ఈ రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు తెలిసింది.

జెడ్పీటీసీ ఎంపీపీల రిజర్వేషన్లు ఇలా..

జెడ్పీటీసీ స్థానం	ప్రస్తుత రిజర్వేషన్	ఎంపీపీ
నిజాంపేట	ఎస్టీ మహిళ	ఎస్టీ మహిళ
మొగుడంపల్లి	ఎస్టీ జనరల్	ఎస్టీ జనరల్
చౌటకూర్	ఎస్సీ మహిళ	ఎస్సీ మహిళ
సదాశివపేట	ఎస్సీ జనరల్	బీసీ జనరల్
కొండాపూర్	ఎస్సీ మహిళ	ఎస్సీ మహిళ
మునిపల్లి	ఎస్సీ జనరల్	బీసీ మహిళ
సంగారెడ్డి	ఎస్సీ మహిళ	బీసీ మహిళ
మనూరు	ఎస్సీ జనరల్	ఎస్సీ మహిళ
ఆందోల్	బీసీ మహిళ	బీసీ మహిళ
వట్‌పల్లి	బీసీ జనరల్	బీసీ మహిళ
కల్హేర్	బీసీ మహిళ	బీసీ జనరల్
పటాన్‌చెరు	బీసీ జనరల్	బీసీ జనరల్
న్యాల్‌కల్	బీసీ జనరల్	బీసీ జనరల్
గుమ్మడిదల	బీసీ మహిళ	బీసీ మహిళ
ఝరాసంఘం	బీసీ జనరల్	బీసీ మహిళ
కంది	బీసీ మహిళ	బీసీ జనరల్
కంగ్టి	బీసీ జనరల్	బీసీ జనరల్
పుల్కల్	బీసీ జనరల్	జనరల్
జహీరాబాద్	బీసీ మహిళ	ఎస్సీ జనరల్
రాయికోడ్	జనరల్ మహిళ	బీసీ మహిళ
హత్నూర	జనరల్	జనరల్ మహిళ
సిర్గాపూర్	జనరల్ మహిళ	జనరల్
కోహీర్	జనరల్ మహిళ	జనరల్ మహిళ
ఖేడ్	జనరల్	జనరల్
నాగల్‌గిద్ద	జనరల్	జనరల్ మహిళ

న్యూస్‌రీల్

పది గేట్ల ద్వారా సింగూరు నీటి విడుదల



పరవళ్లు తొక్కుతోన్న సింగూరు ప్రాజెక్టు

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు గత మూడు రోజులుగా వరద పోటెత్తుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వల్ల భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టులోకి భారీ వరదలు వస్తున్నాయి. మూడు రోజుల నుంచి ప్రాజెక్టు 10 గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టులోకి 90,431 క్యూసెక్కుల నీరు రాగా... డ్యామ్‌లో 18 టీఎంసీలను నిల్వ ఉంచి మిగతా నీటిని దిగువకు వదులుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి



సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న అధికారులు

కొండాపూర్(సంగారెడ్డి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి ప్రజలకు సూచించారు. శనివారం మండల పరిధిలోని తొగర్‌పల్లి గ్రామ శివారులో నివాసముంటున్న 13 కుటుంబాలను పడవ ద్వారా గ్రామానికి తరలించారు. అనంతరం వారిని గ్రామంలో గల బాలుర వసతి గృహానికి తరలించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో ఇల్లు మంజూరు చేసి నిర్మించి ఇవ్వాలని అధికారులను వేడుకున్నారు.

జాడిమల్కాపూర్ ఎత్తిపోతలకు జలకళ



జాడిమల్కాపూర్ ఎత్తిపోతల వద్ద జలకళ

జహీరాబాద్ టౌన్: ఏకధాటిగా కురుస్తోన్న భారీ వర్షాలకు మొగుడంపల్లి మండలంలోని జాడిమల్కాపూర్ ఎత్తిపోతలకు జలకళ వచ్చింది. తెలంగాణ–కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో జాడిమల్కాపూర్, సజ్జరావుపేట తండాల సమీపంలో వాటర్ ఫాల్ ఉంది. వారం రోజుల నుంచి భారీ వర్షాలు పడుతుండటంతో ఎత్తిపోతలకు వరద వస్తుంది. జహీరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు సమీప గ్రామాల ప్రజలు ఎత్తిపోతలను చూసేందుకు వచ్చి సెల్ఫీలు తీసుకుంటున్నారు.

పరిహారం చెల్లించాలి

సదాశివపేట(సంగారెడ్డి): అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను గుర్తించి ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో ఏఈఓ రవితో కలసి శనివారం పట్టణ పరిధిలోని సిద్ధాపూర్ గ్రామంలో వర్షాలకు నష్టపోయిన పసుపు, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ అధికారులు జిల్లా వ్యాప్తంగా పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి పంపించాలని కోరారు.

భూములను గుంజుకుంటారా?

సీపీఎం నేత చుక్కా రాములు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: అభివృద్ధి పేరుతో పేదల భూములనే ఎందుకు గుంజుకుంటున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు ప్రశ్నించారు. ఏళ్ల నుంచి భూమిని నమ్ముకుని బ్రతుకుతున్న పేదలను భూమి నుంచి వేరు చేసేలా ప్రభుత్వ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. స్థానిక కేకే భవన్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు శనివారం ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ట్రిపుల్ ఆర్ రైతులతో కలిసి ధర్నా చేశారు.

నైపుణ్యాలను పెంచుకోవాలి

మంత్రి దామోదర రాజనర్సింహ



ఏటీసీని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర. చిత్రంలో ప్రావీణ్య, పరితోశ్, నిర్మలారెడ్డి.

సంగారెడ్డి జోన్: మారుతున్న కాలానికనుగుణంగా పోటీ ప్రపంచంలో ప్రతీ విద్యార్థి సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. సంగారెడ్డి ఐటీఐ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏటీసీ కేంద్రాన్ని శనివారం మంత్రి టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోశ్ పంకజ్, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రాష్ట్రంలో యువకుల్లో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ప్రారంభించడం జరిగిందన్నారు. యువకుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఏటీసీ సెంటర్లు దోహదపడతాయని చెప్పారు. విద్యార్థులకు ప్రత్యేకంగా సాంకేతిక రంగంలో శిక్షణనిచ్చి ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

దివ్యాంగులకు పరికరాలు పంపిణీ

జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 138 మంది దివ్యాంగులకు మంత్రి దామోదర దివ్యాంగ పరికరాలు పంపిణీ చేశారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 16 మంది దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే సైకిళ్లు, 36 మందికి ట్రై సైకిళ్లు, 35 మందికి వీల్ చైర్లు, 15 మందికి మీడియం సైజ్ కుర్చీలు, 15 మందికి లార్జ్‌సైజ్ కుర్చీలు, 11 మంది వినికిడి లోపం ఉన్నవారికి హియరింగ్ బడ్స్, పదిమంది అంధులకు బ్లైండ్ వాకింగ్ స్టిక్‌లు పంపిణీ చేశారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్‌రెడ్డి, అదనపు లేబర్ కమిషనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

హత్నూరలో ఏటీసీని ప్రారంభించిన ఎమ్మెల్యే సునీతారెడ్డి



మాట్లాడుతున్న సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఉపాధి అవకాశాలు పొందాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. హత్నూర ఐటీఐ ప్రాంగణంలో నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గతంలో ఐటీఐలో శిక్షణ పొంది ఎంతో మంది విద్యార్థులు ప్రైవేటు, ప్రభుత్వ పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు పొందారన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఉద్యోగ అవకాశాలతోపాటు స్వయం ఉపాధి పొందాలని సూచించారు. రూ. కోట్లతో నిర్మించిన ఏటీసీ సెంటర్ ద్వారా ఎంతోమంది విద్యార్థులకు అధునాతన యంత్ర పరికరాల ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే

కొన్యాల గ్రామ శివారులో ఉధృతంగా ప్రవహిస్తోన్న మంజీరా నది నీటి ప్రవాహంలో మునిగిన పంటలను సునీతారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరతానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, టీజీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

మంజీరాకు పోటెత్తిన వరద



వరద ఉధృతికి నీట మునిగిన పంటలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఎగువ ప్రాంతమైన కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు మంజీరా నదిలోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. రెండు రోజులుగా వరద ప్రవాహం పెరగుతుండటంతో నది పరీవాహక ప్రాంతాలైన హుస్సేన్ నగర్, చీకూర్తి, అమీరాబాద్, కాకిజన్‌వాడ, ముర్తుజాపూర్, రాఘవాపూర్, చాల్కి తదితర గ్రామాల పరిధిలోని పత్తి, చెరకు, సోయా, కంది పంటలు నీట మునిగాయి. శుక్రవారం రాత్రి సుమారు 40 నిమిషాల పాటు ఏకధాటిగా కురిసిన వర్షం కారణంగా నదిలోకి పెద్ద ఎత్తున నీరు వస్తోంది. దీంతో మంజీరా నదిలో నీటిమట్టం పెరిగి అధిక శాతం పంటలు నీట మునుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా నారింజ వాగులోకి కూడా భారీగా వరద రావడంతో పరీవాహక ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి.

తక్షణమే మరమ్మతులు చేపట్టాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



రహదారిని పరిశీలిస్తున్న చింతా ప్రభాకర్

కొండాపూర్ (సంగారెడ్డి)/సదాశివపేట(సంగారెడ్డి): భారీ వర్షాలకు తెగిపోయిన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధికారులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని సైదాపూర్ భారీ వర్షానికి కొట్టుకుపోయిన రహదారిని పరిశీలించారు. అంతకుముందు సదాశివపేట పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద నెలకొల్పిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. జీవితాంతం విలువలతో కట్టుబడిన వ్యక్తిగా కొండా లక్ష్మణ్ బతికారన్నారు. యువత ఆయన అడుగుజాడల్లో నడిచి ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఇక సైదాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాతావరణ శాఖ తీవ్ర వర్షాలు ఉంటాయని హెచ్చరించిన నేపథ్యంలో ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించాలని సూచించారు. గ్రామ శివారులోని రోడ్డు కొట్టుకుపోవడంతో చుట్టుపక్కల ఉన్న 40 ఎకరాలు వరి, పత్తి పంటలు నష్టపోయాయని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. భారీ వర్షాలతో 40 ఎకరాల్లో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని ప్రభుత్వానికి హితవు పలికారు. పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు మల్లన్నగౌడ్‌తోపాటు స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో నీటి సరఫరా

వాటర్‌బోర్డు సీఎండీ అశోక్‌రెడ్డి

సంగారెడ్డి: భారీ వర్షాలతో నీట మునిగిన సదాశివపేట మండలం పెద్దాపూర్ పంప్‌హౌజ్‌ను సోమవారం నాటికల్లా పునరుద్ధరిస్తామని వాటర్‌బోర్డు సీఎండీ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సంగారెడ్డి ఐబీ గెస్ట్‌హౌజ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరా కొనసాగుతున్న సమయంలో ఫిల్టర్ బెడ్‌లోకి వరద చేరడంతో మోటార్లు దెబ్బతిన్నాయన్నారు. మూసీ నదికి వరద పెరగడంతో హైదరాబాద్‌లో కొన్ని ప్రాంతాల్లోకి నీరు చేరిందన్నారు. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ రిజర్వాయర్లకు వరద ఉధృతి పెరిగిందని తెలిపారు.

లక్ష్మణ్ ఆశయాలు కొనసాగిస్తాం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



బాపూజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్/సంగారెడ్డి జోన్: తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరులోని శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహం వద్ద శనివారం నిర్వహించిన బాపూజీ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ఘన నివాళులర్పించారు. అంతకుముందు పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ, సీతారామపురం కాలనీ, శాంతి నగర్ కాలనీ, గౌతమ్ నగర్ కాలనీ,కృషి డిఫెన్స్ కాలనీలలో రూ.3 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, బీటీ రోడ్డు, నీటి కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో అంగన్‌వాడీ శాఖ ఆధ్వర్యంలో 170 అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు చీరలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమాజంలోని అన్ని వర్గాలకు సమాన రాజకీయ అవకాశాలు కావాలని కోరుకున్న వ్యక్తి బాపూజీ అన్నారు. బాలింతలకు, గర్భిణీలకు పౌష్టికాహారం ప్రాధాన్యతను తెలియజేస్తూ వారి ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీలు అందజేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అశోక్, రామచంద్రపురం మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఐసీడీఎస్ సీడీపీఓ జయరాం నాయక్ పాల్గొన్నారు.

సంగారెడ్డిలో...

సంగారెడ్డిలోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, వివిధ సంఘాల నాయకులు బాపూజీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సజావుగా పోషణ మాసోత్సవాలు

- పోషకాహారంపై అవగాహన కల్పిస్తోన్న అధికారులు
- వచ్చే నెల 16 వరకు మాసోత్సవాలు



పౌష్టికాహారంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

న్యాల్‌కల్(జహీరాబాద్): పోషకాహారంపై అవగాహన లేమి కారణంగా సరైన ఆహారాన్ని తీసుకోకపోవడంతో పోషకాలు అందక పిల్లలు, గర్భిణులు, బాలింతలు వ్యాధుల బారిన పడుతున్నారు. బాలింతలు, గర్భిణులు రక్తహీనతో సతమతమవుతుండగా, పుట్టిన బిడ్డల ఎదుగుదలపై కూడా ప్రభావం పడుతోంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది కూడా తొమ్మిది రోజులుగా ఊరూరా పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 1,504 కేంద్రాలు

జిల్లాలో 1,504 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 1,432 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పని చేస్తున్నారు. ఆయా కేంద్రాల పరిధిలో 9,907 మంది గర్భిణులు, 9,265 మంది బాలింతలు, 1,02,143 మంది చిన్నారులు ఉన్నారు. వీరందరికీ అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఈ మాసోత్సవాల్లో తల్లిదండ్రులతోపాటు ఆశ వర్కర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వైద్య సిబ్బంది పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరిస్తున్నారు.

ఇవీ కార్యక్రమాలు

అక్టోబర్ 16వరకు నాలుగు వారాల పాటు నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలతో సమావేశాలతోపాటు వంటల పోటీలు ఏర్పాటు చేశారు. పిల్లల బరువు, ఎత్తు, కొలతలు తీసుకోవడంతోపాటు చక్కెర, నూనె వినియోగం, చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తారు. కేంద్రాల్లో బొమ్మల ప్రదర్శన, కథలు చెప్పడం, పోషణ లోపం ఉన్న పిల్లలకు వైద్య పరీక్షలు, రక్తహీనత, అధిక బరువు వల్ల వచ్చే సమస్యలపై అవగాహన కల్పిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ కార్నర్ ఏర్పాటు, కూరగాయలు, పెరటి తోటల పెంపకం గురించి వివరించడంతోపాటు గర్భిణుల ఇళ్లను సందర్శన చేయనున్నారు.

“ అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఈనెల 17న ప్రారంభమైన ఉత్సవాలు వచ్చే నెల 16 వరకు జరగనున్నాయి. నెల పాటు నిర్వహించే మాసోత్సవాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకునే పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నాం. ఈ నెల 27 నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు పండుగ సెలవులున్నందున అందుబాటులో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు మాసోత్సవాలు నిర్వహిస్తారు.

– లలితాకుమారి, జిల్లా సంక్షేమ అధికారి ”

క్లుప్తంగా

దాబా సీజ్

నిజాంపేట(మెదక్): అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న దాబాను సీజ్ చేశారు. వివరాలు ఇలా... శనివారం మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలోని వెంకట్ గౌడ్‌కు చెందిన భవానీ దాబాలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం పోలీసులకు తెలిసింది. దీంతో ఆర్డీఓ ఉత్తర్వుల మేరకు దాబా యజమానికి నోటీసులు అందజేసి సీజ్ చేశారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు.

నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు


హోటల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న బాంబు స్క్వాడ్, నార్కోటిక్ బృందాలు

కొల్చారం(నర్సాపూర్): మాదక ద్రవ్యాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. శనివారం డ్రగ్స్, గంజాయిని నివారించేందుకు మండలంలోని పోతంశెట్టిపల్లి చౌరస్తాలో గల హోటళ్లు, దుకాణాలు, రెస్టారెంట్లలో బాంబు స్క్వాడ్, నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. మండలానికి చేరుకున్న ఆ బృందాలు స్థానిక పోలీసులతో కలిసి తనిఖీల్లో పాల్గొన్నాయి.

లంచం అడిగిన కార్యదర్శి సస్పెన్షన్

నారాయణఖేడ్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి లబ్ధిదారుడ్ని లంచం డిమాండ్ చేసినందుకు పంచాయతీ కార్యదర్శి మహబూబ్ అలీని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఉత్తర్వులు జారీ చేశారు. నిజాంపేట్ మండలం ఈదుత్ తండాకు చెందిన ఆంగోత్ తులసీ బాయి బేస్మెంట్ వరకు ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకుంది. నిర్మాణానికి సంబంధించిన ఫొటో క్యాప్చర్ కోసం కార్యదర్శి రూ.5వేలు డిమాండ్ చేశాడు. ఈ మేరకు బాధితురాలు టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయగా.. పీడీ చలపతిరావు విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. పీడీ నివేదిక ఆధారంగా కలెక్టర్ కార్యదర్శిని సస్పెండ్ చేశారు.

ఫోర్జరీ కేసులో రెండేళ్ల జైలు

జోగిపేట (అందోల్) : దొంగ సంతకాలతో (ఫోర్జరీ) రిజిస్ట్రేషన్ చేసినందుకు నలుగురికి కోర్టు రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించింది. జోగిపేట ఎస్‌ఐ పాండు వివరాల ప్రకారం... శంకరంపేట మండలం మడిశెట్టి పల్లి గ్రామానికి చెందిన పుష్పవతికి పదెకరాల వ్యవసాయ భూమి ఉంది. 2008లో రాణి అనే మహిళను పుష్పవతిగా వక్రీకరించి సులోచన కొన్నట్లుగా రిజిస్ట్రేషన్ చేశారు. కాగా పీపీ స్వాతి గౌడ్ కోర్టులో వాదనలు వినిపించారు. ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేసిన రాణి, సులోచనలకు, ఇందులో సాక్ష్యాలుగా ఉన్న పెంటయ్య, సుమిత్రలకు జోగిపేట మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి రెండేళ్ల జైలు శిక్ష, వెయ్యి జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు.

గంజాయి స్వాధీనం

జిన్నారం (పటాన్‌చెరు): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి పట్టుబడ్డాడు. సీఐ రవీందర్ రెడ్డి వివరాల ప్రకారం... పట్టణ పరిధిలోని ఓఆర్ఆర్ వద్ద శనివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఒడిశా రాష్ట్రానికి చెందిన పూర్ణచంద్ర భరిమాల్ ద్విచక్రవాహనాన్ని తనిఖీ చేయగా అతని వద్ద 90 గ్రాముల ఎండు గంజాయి లభించింది. దీంతో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకొని విచారించారు. తనకు గంజాయి తీసుకునే అలవాటు ఉందని, తాను నివాసముండే గది పక్కన ఓ మూతబడిన పరిశ్రమలో విత్తనాలు వేసి గంజాయి పండిస్తానని తెలిపాడు. అలా పెరిగిన చెట్టు ఆకులను ఎండపెట్టి దానిని విక్రయిస్తానని వెల్లడించారు. కాగా నిందితుడి నుండి 19 గంజాయి మొక్కలు, పల్సర్ బైక్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

చరిత్రకు సాక్ష్యాలు

ఆదిమానవుల నేల... శిలా శాసనాల ఖిల్లా గజ్వేల్

- వర్గల్ శంభుని గుట్టపై చిహ్నాలు
- గుట్ట పరిసరాల్లో రాక్షస గూళ్లు
- మానవ పరిణామ క్రమానికి గీటురాయి

యుగాలు, తరాలు మారినా, శాస్త్ర సాంకేతిక పురోగతి రాకెట్ వేగంతో దూసుకెళుతున్నా.. ఆనాటి మానవుని మనోభావాలు, శిలా శాసనాలు ఏదో రూపంలో బయటపడుతూనే ఉన్నాయి. ఇలాంటి విశేషాలకు సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రాంతం నిలయంగా మారుతోంది. ఈ ఆధారాలు మానవ వికాస పరిణామక్రమానికి ఎల్లలు లేవనే విషయాన్ని చాటి చెబుతున్నాయి. గజ్వేల్ ప్రాంతంలోని ఆదిమానవుల చారిత్రక విశేషాలు, శిలాశాసనాల ప్రత్యేకతలపై ఈ వారం కథనం. – గజ్వేల్ / వర్గల్(గజ్వేల్) :


వర్గల్ సరస్వతి ఆలయంతో కూడిన శంభుని కొండ

సండే స్పెషల్

గజ్వేల్ నియోజకవర్గంలో రెండో బాసరగా విశేష ఆదరణ కలిగిన చదువుల తల్లి కొలువుదీరిన వర్గల్ శంభుని కొండ గుహలు, నాడు ఆదిమానవుల నెలవులుగా విలసిల్లిన ఆనవాళ్లు ఉన్నాయి. వర్గల్ గ్రామానికి ఆగ్నేయ దిశలో ఎత్తైన కొండల శిఖరాగ్రాన శ్రీవిద్యా సరస్వతి అమ్మవారి సన్నిధానం ఎడమ పక్కన పెద్ద బండరాయి ఉన్నది. ఈ రాయి అడుగున ఎరుపు రంగులో అర్థం కాని భాషలో నాడు ఇక్కడ ఆవాసమున్న ఆదిమానవులు లిఖించినట్లు చెప్పబడుతున్న అక్షరాలు నేటికీ కనిపిస్తున్నాయి.

గుట్ట పరిసరాల్లో 'రాక్షసగూళ్లు'

శంభుని కొండ పరిసరాల్లో బృహత్ శిలాయుగపు నాటి ఆది మానవుల సమాధులుగా చెప్పుకునే 'రాక్షస గూళ్లు' పెద్ద సంఖ్యలో ఉన్నాయి. మధ్యన సమాధి.. దాని చుట్టూ గుండ్రంగా, వృత్తాకారంలో పెద్ద పెద్ద బండలతో పేర్చినట్లు కనిపిస్తాయి. వర్గల్‌కు నైరుతి దిశలో అటవీ ప్రాంతంతో కూడిన తున్కిఖాల్సా గ్రామ సమీపంలో పెద్ద సంఖ్యలో 'రాక్షస గూళ్లు' నాటి చరిత్రకు అద్దం పడుతున్నాయి.


వర్గల్ మండలంలో రాజుల నాటి శాసనాలు కూడా ఉన్నాయి. వర్గల్‌లో మూల స్థాన ఆలయానికి క్రీస్తు శకం 970లో కొంత భూమిని అప్పటి రాజులు దానంగా ఇస్తున్నట్లు పేర్కొంటూ కన్నడ భాషలో దాన శిలా శాసనం చెక్కించారు. అలాగే సీతారాంపల్లిలో క్రీస్తు శకం 979 నాటి శిలాశాసనం ఉన్నది.

పలు గ్రామాల్లో శిలా శాసనాలు

దాదాపు 5 ఫీట్ల ఎత్తున్న శిలపై నాలుగు దిక్కులా కన్నడ భాషలో అక్షరాలు చెక్కించారు. వేలూరు గ్రామ పటేల్ చెరువు పూడిక తీత పనుల్లో బయటపడిన దీనిని గ్రామ కూడలిలో స్థాపించారు.

- గజ్వేల్ ప్రాంతంలోని కొండపాక రుద్రేశ్వరాలయ ప్రతిష్ట, ఆలయ నిర్వహణకు భూ దానం అంశాన్ని వివరిస్తూ నాడు కాకతీయ రుద్రదేవుడి కాలంలో క్రీ.శ.1194 వేయించిన శాసనమున్నది.
- అలాగే ఐతేశ్వర సోమనాథ ఆలయానికి సంబంధించి ఒకే శిలపై కాకతీయ గణపతిదేవ చక్రవర్తి కాలం నాటి రెండు శాసనాలున్నాయి.
- మర్కూక్ మండలం పాములపర్తి పటేల్‌చెరువు వద్ద క్రీ.శ.1148 నాటి దానశాసనంను గుర్తించారు. అదేవిధంగా ఇటిక్యాలలో మూడు పక్కల తెలుగు, ఒక వైపు సంస్కృత శ్లోకంతో కూడిన శాసనం కనపడుతుంది.


వర్గల్ గుట్ట పరిసరాల్లో రాక్షసగూళ్లు


ఆదిమానవులు వేసిన జంతువుల బొమ్మలు


సీతారాంపల్లిలో క్రీ.శ. 979 నాటి శిలాశాసనం

చారిత్రక సంపదను సంరక్షించుకోవాలి



పురాతన శాసనాలకు, చారిత్రక సంపదకు గజ్వేల్ నియోజకవర్గం నెలవు. అందుకు సంబంధించి అనేక ఆనవాళ్లు ఉన్నాయి. ప్రభుత్వం ఇక్కడి ప్రాచీన చారిత్రక, పురాతత్వ, శిల్ప కళాసంపదలు కాలగర్భంలో కలిసిపోకముందే పరిరక్షించి భావితరాలకు అందజేయడం కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి.

– డాక్టర్ హరినాథ్‌శర్మ, రిటైర్డ్ ప్రభుత్వ తెలుగు శాఖాధిపతి

చేర్యాల పట్టణం.. జలమయం

- వరద నీటిలో కడవేర్గు రోడ్డు
- శుభోదయనగర్‌లో ఇళ్లలోకి వరద
- చర్యలు తీసుకోవాలని స్థానికుల ధర్నా

చేర్యాల(సిద్దిపేట): రెండు మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పెద్ద చెరువు నిండి మత్తడి దూకడంతో వరద నీరు పట్టణంలోని ఇండ్లలోకి చేరింది. దీంతో కడవేర్గు రోడ్డు ప్రాంతం అంతా జలమయంగా మారింది. ప్రధానంగా పెద్ద చెరువు మత్తడి నీరు శుభోదయనగర్ ప్రాంతం గుండా కుడి చెరువులోకి చేరాల్సి ఉంది. కానీ వరదనీటికి అడ్డంగా నిర్మాణాలు చేయడంతో నీరు ఇండ్లలోకి చేరింది. గాంధీ చౌక్ ప్రాంతంలో చేపడుతున్న వంతెన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో రెండు వైపులా నీరు నిలిచి ప్రధాన రహదారిపై వెళ్లే వాహన దారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ దిలీప్ నాయక్, సీఐ ఎల్.శ్రీను, ఎస్‌ఐ నవీన్ జేసీబీ సహాయంతో గాంధీ చౌక్, కడవేర్గు వెళ్లే రోడ్డు ప్రాంతంలో వరద నీటిని కుడి చెరువులోకి మళ్లించారు. దీంతో వాహన రాకపోకలకు కొంత సులువైంది. కానీ ప్రజలు అధికారుల తీరును నిరసిస్తూ తమ ఇండ్లల్లోకి వరద నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. వారితో తహసీల్దార్, సీఐలు మాట్లాడి శాంతింపజేశారు. అనంతరం శుభోదయనగర్ ప్రాంతాన్ని పరిశీలించారు.


జేసీబీ సహాయంతో వరద నీటిని మళ్లిస్తున్న సీఐ శ్రీను, తదితరులు


శుభోదయనగర్ ప్రాంతంలో ఇండ్ల మధ్యలో నిలిచిన వరద నీరు

అదుపుతప్పి కారు బోల్తా


బోల్తా పడిన కారు

శివంపేట(నర్సాపూర్): కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన మండలంలోని తిమ్మాపూర్ చౌరస్తా శివారులో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన పలువురు కారులో పటాన్‌చెరు వెళ్లి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో నర్సాపూర్–తూప్రాన్ ప్రధాన రహదారిపై తిమ్మాపూర్ గేట్ వద్ద ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో కారు ధ్వంసం కాగా అందులో ప్రయాణిస్తున్న నవీన్ రెడ్డితో పాటు పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి కారు నుండి బయటకు తీశారు.

మరో ఘటనలో లారీ

చేగుంట(తూప్రాన్): అదుపుతప్పి లారీ బోల్తాపడిన ఘటన మండల కేంద్రమైన చేగుంట శివారులోని జాతీయరహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... హైదరాబాద్ నుండి నిజామాబాద్ వైపునకు వెళుతున్న లారీ అదుపుతప్పి సురానా పరిశ్రమ వద్ద బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ జానీకి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయాలైన డ్రైవర్‌ను తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

శాస్త్రీయ పద్ధతిలో భూసేకరణ చేపట్టాలి


ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గజ్వేల్‌రూరల్: శాస్త్రీయ పద్ధతిలో రింగురోడ్డు భూసేకరణ చేపట్టి రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ డీటీ భాగ్య రేఖకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని జగదేవ్‌పూర్, మర్కూక్, గజ్వేల్, వర్గల్, రాయపోల్ మండలాల పరిధిలో 20 గ్రామాల మీదుగా ట్రిపుల్ ఆర్ వెళ్తుందన్నారు. ఇందులో సుమారు 980 ఎకరాల భూమి రింగురోడ్డుకు అవసరమున్నట్లు సర్వే చేశారని తెలిపారు. భూమిని కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి ఇవ్వాలని, లేనిచో బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా మూడు రెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి కుటుంబానికి 250 గజాల స్థలం కేటాయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజు, భూబాధితులు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసుల్లో విచారణ వేగవంతం

- జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు


ఉత్తమ సేవలందించిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ మున్సిపాలిటీ: పోక్సో, గ్రేవ్ కేసుల్లో వేగంగా ఇన్వెస్టిగేషన్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోక్సో కేసుల్లో ఇన్వెస్టిగేషన్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. అవసరమైతే న్యాయమూర్తులను స్వయంగా కలవడం ద్వారా కేసుల పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. కాగా మెదక్‌లోని ఎస్‌బీఐలో దొంగతనం చేయడానికి ప్రయత్నించిన నిందితులను త్వరితగతిన పట్టుకొని రిమాండ్‌కు తరలించడంపై పోలీసుల అధికారులను ఎస్పీ అభినందించారు. అంతకుముందు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి

జహీరాబాద్ టౌన్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రాయిపల్లి(డి)గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ.కాశీనాథ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ శనివారం దసరా పండుగను పురస్కరించుకుని ఇంట్లో ఘటాలు కూర్చోబెడుతుండగా తోరణాల కోసం మామిడి ఆకుల కోసం ఇంటినుంచి వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా గ్రామ శివారులో గల ఓ వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. కాళ్లు చేతులు కడగడానికి నీళ్ల వద్దకు వెళ్లి జారి పడ్డాడా? లేదా ఆయన మృతికి ఇంకా ఏదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కల్లు దుకాణం వద్ద 26వ తేదీ రాత్రి గుర్తు తెలియని(55) వ్యక్తి పడి మృతి చెంది కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ..


ఆయేషా బేగం

హత్నూర(సంగారెడ్డి): ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని కాసాల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీధర్ రెడ్డి, కుటుంబీకుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన ఆయేషా బేగం(30) కొన్ని నెలల క్రితం గ్రామంలోని స్వయం సహాయక సంఘంలో రుణం తీసుకుంది. మూడు నెలలుగా డబ్బులు అందక చెల్లించలేదు. దీంతో తోటి గ్రూపు సభ్యులు ఇంటికి వెళ్లి తిట్టడంతో ఈ నెల 20న ఆయేషా బేగం మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ గాంధీకి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్తతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పండుగ పూట విషాదం

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట): పండుగ పూట వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. వివరాలు ఇలా...చిన్నకోడూరు గ్రామానికి చెందిన కొలను శంకర్(45) శనివారం సాయంత్రం గ్రామంలో ఇంట్లో సద్దుల బతుకమ్మను పేర్చి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. ఎంతకు తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లారు. శేరుపల్లి ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో పడిపోయి ఉన్నాడు. సమీప రైతులతో కలిసి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య కనకవ్వ, కుమారుడు ఉన్నారు.

ఆల్ప్రాజోలం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న అదనపు సీఐ

గజ్వేల్‌రూరల్: మత్తు పదార్థాలతో కల్లును తయారు చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. గజ్వేల్ అదనపు సీఐ ముత్యంరాజు శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో కేసు వివరాలు వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ(పల్లెపహాడ్)లో మర్కూక్ మండలం పాములపర్తికి చెందిన టీ.లక్ష్మణ్‌గౌడ్, తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌కు చెందిన ఎం.నర్సింలుగౌడ్, నార్సింగికి చెందిన జీ.శ్రీకాంత్‌గౌడ్, కాచాపూర్‌కు చెందిన పీ.సాయికుమార్‌గౌడ్ కలిసి కల్లు దుకాణం నిర్వహిస్తున్నారు. వీరు కొన్ని రోజులుగా ఆల్ప్రాజోలం, ఇతర మత్తు పదార్థాలను కల్లులో కలిపి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులతో కలిసి రైడ్ చేశారు. దాడిలో రూ. 84వేల విలువ చేసే 210 గ్రాముల ఆల్ప్రాజోలమ్‌తో పాటు గ్మాల మిక్స్, మిక్స్ పౌడర్, వైట్‌పౌడర్, కట్ట, సచరిన్, సోడాతో పాటు 3 సెల్‌ఫోన్‌లు, కారును స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మణ్‌గౌడ్, నర్సింలు, శ్రీకాంత్‌గౌడ్‌లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించగా, సాయికుమార్‌గౌడ్ పరారీలో ఉన్నాడు. ఎస్‌ఐలు ప్రేమ్‌దీప్, రఘుపతి, టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీస్ సిబ్బంది స్వామి, వెంకటేశ్, రవీందర్, వెంకన్న, నరేందర్ ఉన్నారు.

పొలం పనులు ముగించుకుని వస్తుండగా...

లారీ ఢీకొని రైతు మృతి


మల్లారెడ్డి

దుబ్బాకరూరల్: రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని హబ్షీపూర్ వద్ద సిద్దిపేట-రామాయంపేట రహదారిపై జరిగింది. గ్రామస్తుల వివరాలు... రైతు బొంగురం మల్లారెడ్డి(42)తన వ్యవసాయ పొలం వద్ద పనులు ముగించుకుని సాయంత్రం తన పాడి గేదెను తోలుకుని ఇంటికి వస్తున్నాడు. ఇదే క్రమంలో రామాయంపేట వైపు నుంచి సిద్దిపేట వైపు అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామస్తులు ఆగ్రహంతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. డ్రైవర్ లారీని అక్కడే వదిలి పరారయ్యాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాల్లో ఆకట్టుకున్న కళాకారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తిరుమల తిరుపతి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన హిమగిరి కళాకారులు శనివారం నృత్య ప్రదర్శన చేసి అలరించినట్లు, హిమగిరి నృత్య శిక్షణ సంస్థ నిర్వాహకులు సుజన యాదవ్, గిరి తెలిపారు. అకాడమీకు చెందిన 21 మంది యువ కళాకారులు ప్రదర్శించిన నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుందన్నారు. భారతీయ సంప్రదాయ నృత్య వైభవాన్ని ప్రతిబింబించే ఈ నృత్యాలు అందరినీ మంత్రముగ్ధులను చేశాయని పేర్కొన్నారు.


నృత్య ప్రదర్శన చేసిన సిద్దిపేట హిమగిరి కళాకారులు

సమీకృతం.. నిధుల గండం?

నిలిచిన వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం

- రోడ్ల పైనే కూరగాయల అమ్మకాలు


అసంపూర్తిగా సమీకృత మార్కెట్ భవనం

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో సమీకృత శాఖాహార, మాంసాహార మార్కెట్ భవన నిర్మాణానికి నిధుల గ్రహణం పట్టుకుంది. గత ప్రభుత్వంలో రూ.2.75 కోట్లతో సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం నిధుల కొరతతో భవనం పిల్లర్ల వరకే పరిమితమైంది. కూరగాయలు, మాంసం అమ్మకాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని మార్కెట్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపు మూడేళ్లు గడిచినా భవన నిర్మాణం పిల్లర్ల వద్దనే కునారిల్లుతుంది.

హుస్నాబాద్ పట్టణంలో సమీకృత మార్కెట్ భవనం లేకపోవడంతో చిరు వ్యాపారులు ఎక్కడ పడితే అక్కడే రోడ్లపై కూరగాయలు అమ్ముతున్నారు. మల్లెచెట్టు చౌరస్తా, రామవరం రోడ్, బస్టాండ్ ఏరియా, అంబేడ్కర్ చౌరస్తా ఇలా ప్రధాన కూడళ్లలో కూరగాయలు అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. కాగా రోడ్లపై అమ్మకాలు కొనసాగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది.

ఇంకా పిల్లర్ల స్థాయిలోనే..

గత ప్రభుత్వంలో ఎంఏ అండ్ యూడీ గ్రాంట్ కింద ఈ భవన నిర్మాణానికి రూ.2.75 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నిధులను నిలిపివేసినట్లు సమాచారం. నిధులు విడుదల కాకపోవడంతో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ భవన నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి.



ప్రారంభానికి నోచుకోని రైతు బజార్

గత ప్రభుత్వంలో దాదాపు రూ.3.50 కోట్లతో రైతు బజార్‌కు శ్రీకారం చుట్టారు. ఈ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో రైతు బజార్, పైరెండు అంతస్తుల్లో ఫంక్షన్ హాల్ నిర్మించారు. ఈ భవనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించి దాదాపు 6 నెలలు గడుస్తుంది. ఈ భవనం అందుబాటులోకి తీసుకువస్తే తాత్కాలికంగా రోడ్లపై కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులను ఇక్కడికి రప్పించే అవకాశం ఉంది. కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన భవనాలు అలంకార ప్రాయంగానే ఉంటున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.